క్లుప్తంగా

అనాథలకు జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



తిరుపతి, ఆశిష్‌లను ఆశ్రమానికి తీసుకొస్తున్న మమత

విశాఖ విద్య: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనాథలకు జీవీఎంసీ షెల్టర్‌లో గురువారం ఆశ్రయం కల్పించారు. తిరుపతి, ఆశిష్ అనే ఇద్దరు వ్యక్తులు నగరంలోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరగా.. వీరిని గురువారం డిశ్చార్జ్ చేసేందుకు నిర్ణయించారు. వారికి ఎవ్వరూ లేకపోవడంతో ఎన్ఏడీ బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. ఆమె ఆస్పత్రికి వెళ్లి తిరుపతి, ఆశిష్‌లను తమ షెల్టర్‌కు తీసుకెళ్తామని వైద్యులతో చెప్పారు. ఆ ఇద్దరు ఆనాథలను ఆశ్రమానికి తీసుకొచ్చి తగిన వసతి సౌకర్యాలు కల్పించారు.

హిందీ భాషను అందరూ నేర్చుకోవాలి



హిందీ ఉపాధ్యాయులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో దివాకర్

గోపాలపట్నం : గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో దివాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జాతీయ భాష హిందీ అని తెలిపారు. దీన్ని అందరూ నేర్చుకోవాలని, ఇది భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్తేర్ హెప్సిబా, బాలుర పాఠశాల హెచ్ఎం వేణుగోపాల్, హిందీ ఉపాధ్యాయులు ఫాతిమా సంతోషి, అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు, మొక్కల పంపిణీ రేపు



పంపిణీకి సిద్ధం చేసిన చామంతి మొక్కలు

గోపాలపట్నం: జేడీ ఫౌండేషన్, గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ శనివారం మట్టి వినాయక విగ్రహాలు, చామంతి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యుడు సాలాది శ్రీరామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపట్నం పిన్నమనేని ఫంక్షన్ హాల్ వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని, అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పరుగులు

పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. ఇక్కడ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాగే సచివాలయాల నిర్మాణాలపై కూడా దృష్టి సారిస్తున్నారు. సీఎం జగన్ స్ఫూర్తిగా నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటు పడుతున్నారు.

- రహదారులు, డ్రైనేజీలకు ప్రాధాన్యం
- మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పనులు
- సచివాలయాల కేంద్రంగా సంక్షేమ ఫలాలు



52వ వార్డులోని సాకేతపురం, శాంతినగర్ సచివాలయాలు



మర్రిపాలెం వుడా కాలనీలో నిర్మించిన బీటీ రోడ్డు

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. వార్డుల్లోని కాలనీల్లో గల అంతర్గత రహదారులు పునర్నిర్మాణంతో అద్దంలా మెరిసిపోతున్నాయి. అన్ని వార్డుల్లో ప్రజానీకానికి మౌలిక సౌకర్యాలు పెంపొందించటమే లక్ష్యంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రజావసరాల నేపథ్యంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రాతినిధ్యం వహించే 52వ వార్డులోని మర్రిపాలెం వుడా లేఅవుట్‌తో పాటు, వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో ఇప్పటికే బీటీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీల నిర్మాణ పనులు వేగవంతం చేశారు. కార్పొరేటర్‌గా వార్డు సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా జియ్యాని కృషి చేస్తున్నారు. డిప్యూటీ మేయర్‌గా పని చేస్తున్నందున, జీవీఎంసీ అధికారులను వార్డు పరిధిలోని కాలనీల్లో పర్యటించేలా చేస్తూ, అవసరమైన చోట్ల అభివృద్ధి పనులు చేపట్టేలా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పనులు చేపడుతుండటంపై కాలనీవాసులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాలకు సొంత భవనాలు..

సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేర్చటంలో సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిని మరింత బలోపేతం చేసే క్రమంలో సొంత భవనాలు నిర్మిస్తున్నారు. 52వ వార్డు పరిధిలోని గౌరీనగర్ కాలనీ పార్కు వద్ద చేపట్టిన సచివాలయ నూతన భవన నిర్మాణం ఇప్పటికే పూర్తి కావచ్చింది. భవనం కింది భాగంలో శానిటరీ కార్యాలయం, పైన సాకేతపురం–2 సచివాలయం నిర్వహించేలా తగిన సౌకర్యాలతో నిర్మిస్తున్నారు. దశల వారీగా అన్ని సచివాలయాలకు సొంత భవనాలు సమకూర్చేలా డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తోన్న వార్డు కార్పొరేటర్ జియ్యాని కృషి చేస్తున్నారు.



కాలనీ పార్కు వద్ద నిర్మాణంలో ఉన్న సచివాలయం

ఇది ప్రజల క్షేమం కోరే ప్రభుత్వం..



ప్రజా సంక్షేమం కోసమే పని చేయాలనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సిద్ధాంతాల మేరకే స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పని చేస్తున్నారు. అందుకే రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా వార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేస్తుండటం మంచి పరిణామం.

– బీఎస్ కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

సమస్యలు పరిష్కారం అవుతున్నాయి..



కాలనీలో సమస్యల పరిష్కారం కోసం గతంలో అయితే అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటి ముందుకు వలంటీర్లు వచ్చి అన్ని పథకాలు అందిస్తున్నారు. మా కార్పొరేటర్, ఇతర నాయకులు ఇంటింటికీ తిరిగి మా సమస్యలు తెలుసుకుంటున్నారు.

– పేడాడ జ్యోత్స్న

ఇన్నాళ్లకు రోడ్లు బాగుపడ్డాయి..



వార్డులో రోడ్లన్నీ అభివృద్ధి చేయటం వల్ల ప్రజానీకానికి ఇబ్బందులు తొలిగాయి. గత ప్రభుత్వంలో అయితే తమకు నచ్చిన వారు, పార్టీ సానుభూతిపరుల ఇళ్లున్న వీధుల్లోనే అభివృద్ధి పనులు చేసే వారు. కానీ ఇప్పుడు ప్రతి వీధిలో రోడ్లు తళతళలాడుతున్నాయి. ఇన్నాళ్లకు రోడ్లన్నీ బాగుపడటం సంతోషంగా ఉంది.

– వెదుళ్ల శ్రీను, స్థానికుడు

ఆర్పీ పేట హైస్కూల్‌లో హిందీ దినోత్సవం

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు ఎస్.నిర్మల, జొన్నాడ రోహిణి నేతృత్వంలో గురువారం హిందీ దివస్ ఉత్సవాలను హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల, రోహిణిలు మాట్లాడుతూ రాజ్య భాష హిందీ ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యరూపకాలు, పెయింటింగ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధాన్ శ్రావణి, భవాని, వేదసాయి, శ్రావణి, కుష్బు, ప్రవల్లిక, అనుష్క, గీతిక, జ్ఞానేశ్వరి, ప్రణతి, మధుశాలిని, హారిక నవ్య, గీతా, మేఘన, సాయిగౌతమి, స్వాతి, దేవిక అఫ్షానాఖాన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



పెయింటింగ్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులతో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

కాంట్రాక్ట్ కార్మికులకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు పైడిరాజు

మల్కాపురం: యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే నాడు హెచ్‌పీసీఎల్ విస్ఫోటనంలో 62 మంది కార్మికులు మృతి చెందారని సీఐటీయూ నాయకుడు పైడిరాజు ఆరోపించారు. హెచ్‌పీసీఎల్ విస్ఫోటన దినం సందర్భంగా గురువారం సంస్థ సీ గేటు వద్ద ప్రమాదంలో నాడు మృతి చెందిన కార్మికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997లో హెచ్‌పీసీఎల్‌లో జరిగిన ప్రమాదంలో 62 మంది కార్మికులు, ఉద్యోగులు మృతి చెందగా.. వందల మంది గాయాల పాలయ్యారన్నారు. 2013లో ఇదే సంస్థలో జరిగిన మరో ప్రమాదంలో సుమారు 27 మంది వరకు మృతి చెందారని, ఈ రెండు ఘటనలు జరిగినా యాజమాన్యం ఇంకా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌పీసీఎల్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వసతులు, భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

మాకు పొత్తులతో పని లేదు

- చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది..
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం పరిధిలో పలు వార్డుల్లో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద అర్హులైన వారికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్‌కుమార్ ఏడు వార్డుల పరిధి సుమారు 250 మంది అర్హులైన వారికి కొత్త పింఛన్లు అందజేశారు. తమ ప్రభుత్వం మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, చేతల్లో చూపే ప్రభుత్వం అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేందుకు ఎన్ఏడీ వద్ద క్యాంప్ కార్యాలయం, నక్కవానిపాలెం వద్ద మరో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏడు వార్డుల ప్రజలు ఏవైనా సమస్యలుంటే క్యాంప్ కార్యాలయంలో ఇవ్వొచ్చన్నారు. నేడు ఎవరి ఇంటికెళ్లినా రూ. లక్ష నుండి రూ. 6 లక్షల వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు ఉన్నారన్నారు. పేద ప్రజల మనసు తెలిసిన ముఖ్యమంత్రి మన జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పశ్చిమలో గెలిచిన ఎమ్మెల్యే గణబాబు ఈ నాలుగేళ్లలో ఎన్నడైనా మీకు కనిపించారా అని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అందరూ ముఖాలకు పౌడర్లు పూసుకుని వస్తారని, అటువంటి వారిని నమ్మితే భవిష్యత్తుకు గ్యారెంటీ ఉండదన్నారు. వేల కోట్ల రూపాయల స్కామ్‌లు చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జనసేన పార్టీ నిలకడ లేని పార్టీ అని, ఆ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు నేడు పవన్ కళ్యాణ్ గాలి తీశారన్నారు. టీడీపీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పాల్గొంటామని చెప్తున్నారంటే ఆయన నైజం ఏమిటో ఆ పార్టీ కార్యకర్తలు అర్థం చేసుకోవాలన్నారు. ఎంత మంది, ఎన్ని పార్టీలు గుంపుగా వచ్చినా భయపడేది లేదన్నారు. తమ వైపు ఉన్నది సింహం అని, సింహం ఎన్నడూ సింగిల్‌గానే వస్తుందన్నారు. గుంపుగా వచ్చిన వారు వచ్చే ఎన్నికల అనంతరం గంప నెత్తిన పెట్టుకుని వెళ్లిపోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, భోగవల్లి నాగభూషణం, కేబుల్ వాసు, చుక్క వరలక్ష్మి, రేవళ్ల సత్యనారాయణ, ఆడారి హరిష్, అంగ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

89వ వార్డులో 'నా మట్టి - నా దేశం'



కొత్తపాలెంలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ల జ్ఞాపకార్థం ఢిల్లీలో అమృతవనం నిర్మించేందుకు మట్టిని సేకరించారు. కొత్తపాలెంలోని పలు వీధుల్లో తిరుగుతూ ప్రజల వద్ద నుంచి కలశంలో మట్టిని సేకరించి భద్రపరిచారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, పశ్చిమ సమన్వయకర్త దాడి పురుషోత్తమ రమేష్, సభ్యత్వ ప్రముఖ్ జీసీ నాయుడు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మండపాల వద్ద నిబంధనలు పాటించకుంటే చర్యలు



సీఐ జి.డి.బాబు

మల్కాపురం: వినాయక చవితి మండపాల వద్ద నిర్వాహకులు పోలీస్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని మల్కాపురం సీఐ జి.డి. బాబు హెచ్చరించారు. ఈ నెల 18 నుంచి మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ ఉత్సవ నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. మండపాల వద్ద మద్యం తాగి నృత్యాలు చేయడం, రోడ్డుకు అడ్డంగా మండపాల నెలకొల్పడం, పెద్ద శబ్దాలతో కూడిన సౌండ్ బాక్స్‌లు పెట్టడం, అర్ధరాత్రి వరకు సౌండ్ సిస్టమ్ మోగించడం, అసభ్యకర నృత్యాలు ఏర్పాటు చేయడం వంటి చేష్టలకు ఎవరైనా పాల్పడితే క్షమించేది లేదన్నారు. పోలీసుల సూచనల మేరకు ఉత్సవాలు నిర్వహించాలని, వాటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మండపాల వద్ద ఎవరైనా ఇబ్బందికరంగా వ్యవహరిస్తే తక్షణం తనకు ఫోన్ చేయాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



61వ వార్డులో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, కెమికల్ రంగులు పూసిన గణపతులను కాకుండా మట్టి వినాయకుడిని పూజించాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో మల్కాపురం వద్ద గురువారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కెమికల్స్ పూసిన వినాయక ప్రతిమలు సముద్రంలో అంత సులభంగా కరగవన్నారు. ఆ రంగుల వల్ల చేపలు, ఇతర జీవరాశులకు హాని కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, భోగవల్లి నాగభూషణం, కొణతాల జగన్, బూస అప్పలరెడ్డి, కేబుల్ వాసు, మూగి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే 60వ వార్డు శ్రీహరిపురం వద్ద సామాజిక సేవా కార్యకర్త పెద్దిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో కూడా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం



రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: తాను మాటల మనిషి కాదని.. చేతల మనిషినని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి సింహాచలానికి వెళ్లే మార్గంలో రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాట ఇచ్చి తప్పేలా ఎవరూ లేరన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడే పనిచేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామన్నారు. జీవీఎంసీ నిధులు రూ.70 లక్షలతో గోపాలపట్నం బంక్ సెంటర్ నుంచి కుమారి కల్యాణ మండపం వరకు రహదారి(బీటీ రోడ్డు) విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. వీటిని అధికారులు వెంటనే ప్రారంభించాలని ఆడారి సూచించారు.

కార్యక్రమంలో పార్టీ 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, కంపర సత్తిబాబు, కె.రామకృష్ణ, బురెడ్డి గోపి, ఊటపల్లి గోవిందు, నాగూర్, దేరెడ్ల సత్యనారాయణ, పసుపురెడ్డి రమణ, అన్నపూర్ణ, విజయలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 90వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఆనంద్‌కుమార్

విశాఖ విద్య: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం–1 పరిధిలోని శ్రీనివాసనగర్‌లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజలతో మాట్లాడుతూ సమ్యలు ఏమైనా, ఉన్నాయా..? ప్రభుత్వ పథకాలు ఇంకా అందాల్సి ఉందా అనే వివరాలను అడిగారు. ఎటువంటి సమస్య వచ్చినా, తమను సంప్రదిస్తే, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ వార్డు అధ్యక్షుడు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ప్రసాదరెడ్డి, శ్రీను, రమేష్, గొర్లె మురళి, పూడి సత్యం, వెంకటేశ్వరరావు, రామకృష్ణ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు సత్య, లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గాడిచర్ల జయంతి



గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నరసింహం, పాఠకులు

గోపాలపట్నం: గ్రంథాలయ ఉద్యమ నేత, ఆంధ్రా తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి వేడుకలను గురువారం గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తొలి తెలుగు పత్రికా సంపాదకుడిగా గాడిచర్ల ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. గాంధీజీ మెచ్చిన నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు శంకర్, మనోహర్ శ్యామ్, బాలాజీ పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం శ్రేయస్కరం



డిజిటల్ స్క్రీన్ ద్వారా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ తులసీదాస్, ఎస్ఐ సుదర్శన్‌రావు

మల్కాపురం: అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని వాహన చోదకులకు ట్రాఫిక్ సీఐ తులసీదాస్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై మల్కాపురం, శ్రీహరిపురం ముఖ్య కూడళ్ల వద్ద గురువారం డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొంత మంది నిర్లక్ష్యం వల్ల మరికొందరి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడుపుతూ యువత ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మద్యం తాగి కొంత మంది లారీ, ఆటో, కారు డ్రైవర్‌లు నిర్లక్ష్యంగా డ్రైవ్‌చేస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటూ వారి కుటుంబాలను అనాథలను చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుదర్శన్‌రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



కొత్తపాలెంలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులో కొత్త మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందివ్వాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.